క్లుప్తంగా

వరిగడ్డి వామి దగ్ధం

తొండపి(ముప్పాళ్ల): ప్రమాదవశాత్తూ మంటలు అంటుకొని వరిగడ్డి దగ్ధమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని ఆర్. వెంకటేశ్వర్లుకు చెందిన వరి గడ్డి వామికి నిప్పు అంటుకుంది. ఈదురు గాలులు తోడవటంతో మంటలు పక్కనే ఉన్న నరసింహారావుకు చెందిన వరిగడ్డి వామికి వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలు అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి చెందిన సుమారు 12 ఎకరాల వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.లక్ష వరకు నష్టం ఉంటుందని బాధితులు తెలిపారు.

రెంటపాళ్లలో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం



రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభిస్తున్న తహసీల్దార్ సురేష్

సత్తెనపల్లి: మండలంలోని రెంటపాళ్ల గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను గురువారం ప్రారంభించారు. తహసీల్దార్ ఎస్.సురేష్ మండల జాయింట్ రిజిస్టర్ సత్తెనపల్లి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, రెంటపాళ్ల గ్రామ సర్వేయర్, హాజరై ఏకుల రోశయ్య తండ్రి నాగయ్యకు చెందిన భూమిని రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

వలంటీర్లకు సన్మానం



నకరికల్లు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న వలంటీర్లను ప్రభుత్వం తగిన న్యాయం చేస్తోందని వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నర్సింగపాడు, త్రిపురాపురం గ్రామాల వలంటీర్లకు నర్సింగపాడు గ్రామంలో గురువారం ఘనంగా సన్మానించారు. రెండు గ్రామాలకు చెందిన 16మంది వలంటీర్లకు సేవామిత్ర ప్రశంసా పత్రం, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అబ్దుల్ అలీం, జి.చినమార్కు, ఉపసర్పంచి మోహన్‌రెడ్డి, మద్దం సురేష్, శివారెడ్డి, వెంకటస్వామిరెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

20లోపు ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ల: ప్రధానమంత్రి కిసాన్ యోజన లబ్ధి పొందేందుకు గాను ఈ కేవైసీ నమోదు కాని వారు ఈ నెల 20లోగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. మండలంలోని చాగంటివారిపాలెం ఆర్బీకేలో వైఎస్సార్ యంత్రసేవ, మట్టి నమూనాల సేకరణలపై వీఏఏ, వీహెచ్‌ఏలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లోను 1245 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. 2023 ఏడాదికి గాను 93 మందికి పలు కారణాలతో నగదు జమ కాలేదన్నారు. వారంతా 17వ తేదీ లోగా సమస్యలను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. ఎక్కువగా ఆధార్, ఎంపీసీఐ మాపింగ్ లాంటి సమస్యలున్నాయని చెప్పారు. వీరంతా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్‌లో ఖాతా తెరుచుకుంటే సరిపోతుందని వివరించారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకు పంటసాగు పత్రం అందించాలని కోరారు. మట్టి నమూనాలు సేకరించాలని సూచించారు.

కృత్రిమ గర్భధారణలో జాగ్రత్తలు అవసరం

అమరావతి: పశువులకు కృత్రిమ గర్భధారణ చేసేటప్పుడు, చేసిన తరువాత పశుపోషకులు పశువులను నిశితంగా గమనిస్తూ పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి వెంకట్రామయ్య తెలిపారు. గురువారం ఆయన రైతులకు పలు సూచనలిస్తూ పశువులలో ఎదకు వచ్చిన సమయాన్ని గుర్తించి గర్భధారణ చేయించే వరకు ఇతర పశువులు దాటకుండా జాగ్రత్త పడాలన్నారు. మండలంలోని వైకుంఠపురం, ధరణికోట, నరుకుళ్ళపాడు గ్రామాలలో పశుగణాభివృద్ధిశాఖ సిబ్బంది ద్వారా జూపూడి, అత్తలూరు, మునగోడు గ్రామాలలో గోపాలమిత్రల ద్వారా పశువులకు కృత్రిక గర్భధారణ చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలొస్తాయి..

అమరావతి: ఇష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ఎంపీడీఓ మాధురి అన్నారు. ఏపీఈఏపీ సెట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక పల్లోటి కళాశాలలో అభినందన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. నీట్‌లో 529 మార్కులు సాధించి ఏపీఈఏపీ సెట్‌లో 821 ర్యాంకు సాధించిన ఎం.శివమాధవ్‌ను సన్మానించారు. అలాగే ఏపీఈఏపీ సెట్ 4,217ర్యాంకు సాధించిన తల్లం శర్వాణి, 817ర్యాంక్ సాధించిన ఎస్‌కే సమియంతో పాటుగా వసంతలక్ష్మి, కె.వైష్ణవిలను సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పాదర భాస్కర్ పాలొన్నారు.

పల్లె నాడెరిగి సేవలు..

ఈమె మాదిపాడుకు చెందిన షేక్ హుసేన్ బి. వైద్యశాలలో పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్ టెస్ట్‌లు అందుబాటులో ఉండడంతో డబ్బులు ఖర్చు లేకుండా సరిపోయింది. గతంలో పీహెచ్‌సీకి వెళ్లాలంటే భయంగా ఉండేది. కానీ వైద్యశాల అభివృద్ధి చేసిన తరువాత సేవలు బాగున్నాయి. వారానికి ఒక రోజు డాక్టర్ కూడా ఊరికి వస్తున్నారు.



పీహెచ్‌సీలో సకల సదుపాయాలు

- 66 రకాల వైద్య పరీక్షలు
- అందుబాటులో అన్నిరకాల వ్యాక్సిన్లు
- నూతన ఆపరేషన్ థియేటర్



ఆధునిక సదపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అచ్చంపేట: పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో వైద్యశాల ఉంటే డాక్టర్ ఉండేవారు కాదు.. వైద్యుడుంటే మందులు ఉండేవి కావు.. అన్నీ ఉంటే సిబ్బంది కొరత వేధిస్తుండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వైద్యరంగంలో సమూల మార్పులు తెచ్చారు. పల్లెలకు కార్పొరేట్ వైద్యం చేరువ చేయాలనే ఉద్దేశంతో సేవలను విస్తృతం చేశారు.

పీహెచ్‌సీకి నూతన భవనం

నాడు– నేడు కింద రూ.1.25 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. అత్యాధునిక సౌకర్యాలతో బ్లెడ్‌టెస్ట్ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులలో ఏ సమయంలోనైన ప్రథమ చికిత్స చేసేందుకు వైద్య సిబ్బంది, ప్రత్యేకంగా ఇన్ పేషెంట్స్ వార్డు వంటి వసతులు ఏర్పాటు చేశారు.

గతంలో పరీక్షలు..

గతంలో కేవలం సింగిల్ డిజిట్‌లోనే రక్త పరీక్షలు చేసేవారు. అదీ కూడా ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో సిబ్బందిలో ఎవరో ఒకరు రక్త పరీక్షలు చేసేవారు. వాటి ఫలితం సక్రమంగా వస్తుందన్న నమ్మకం కూడా ఉండేది కాదు. లేకుంటే బయట చేయించుకుని రమ్మని రాసి ఇచ్చేవారు.

నేడు పరీక్షలు..

ఇప్పుడు ప్రత్యేకంగా ఆధునిక సౌకర్యాలతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్‌ని నియమించారు. 66 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చారు. ఇందుకు గాను నూతన అధునాతన పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది.

ఇద్దరు వైద్యులు

గతంలో పీహెచ్‌సీలో వైద్యుల కొరత ఉండేది. ఒక్కరూ సక్రమంగా ఉండేవారు కాదు. ఇప్పుడు ఇద్దరు వైద్యులను కేటాయించారు. ఒకరు ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్‌కు వెళ్తే మరొకరు వైద్యశాలలోనే ఉంటూ వైద్యం అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితితులు ఏర్పడితే సత్తెనపల్లి, గుంటూరు తరలించేందుకు వైద్యశాలకు ప్రత్యేకంగా ఒక 108 వాహనాన్ని ఏర్పాటు చేశారు. గతంలో 108 వాహనం క్రోసూరు నుంచి రావాల్సి ఉండేది. ప్రతి రోజు గ్రామాలలో వైద్యసేవలను అందించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి 104 వాహనాన్ని కూడా కేటాయించారు.

ఏడు పడకల వైద్యశాలగా..

అచ్చంపేట పీహెచ్‌సీని ఏడు పడకల వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఇన్‌పేషెంట్స్‌కు అన్ని వసతులతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. అందులో టాయిలెట్స్, బెడ్స్, అప్పుడే పుట్టిన బిడ్డలను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు థెరఫీ వంటి సౌకర్యాలున్నాయి.

అందుబాటులో వాక్సిన్స్

కుక్క, కోతి, పాము, తేలు వంటి వాటి కాటుకు గురైతే తక్షణమే చేసేందుకు అన్ని రకాల వాక్సిన్స్ అందుబాటులోకి తీసుకు వచ్చారు. గతంలో పీహెచ్‌సీలో వ్యాక్సిన్ లేకపోవడంతో వచ్చేరోగులు బయటకు వెళ్లి వేల రూపాయలతో వ్యాక్సిన్ వేయించుకోవాలిన వచ్చేది.

సరిపడా సిబ్బంది....



చల్లగరిగ అంగన్‌వాడీ కేంద్రంలో సేవలందిస్తున్న వైద్యురాలు

వైద్యశాలలో గతంలో సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉండేవి. ఉన్న సిబ్బంది కూడా రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చి సంతకాలు చేసుకునేవారు. ఇప్పుడు ఆపరిస్థితులను స్వస్తి పలికారు. అన్ని పోస్టులను భర్తీచేశారు. ఇద్దరు వైద్యులు, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్, స్టాఫ్‌నర్సులు, హెల్త్ ఎడ్యుకేటర్స్, హెల్త్ సూపర్‌వైజర్స్, మేల్, ఫిమేల్ ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సబ్‌సెంటర్స్‌లోను కావలసిన సిబ్బందిని నియమించారు.

పీహెచ్‌సీలో సేవలు బాగున్నాయి..



గతంలో కంటే పీహెచ్‌సీలో వైద్య సేవలు మెరుగు పడ్డాయి. ఇద్దరు వైద్యులను నియమించారు, ఒకరు ఫ్యామిలీ ఫీజీషియన్ కార్యక్రమానికి వెళ్లుతున్నారు. ఇంకా ఒక్కరే మిగులుతున్నారు. వచ్చే రోగుల సంఖ్యకూడా పెరిగింది. వారికి తగ్గట్టుగా మరో వైద్యుడ్ని నియమిస్తే ఇంకా బాగుంటుంది.

–ఆలపాటి కృష్ణబాబు

ఇంటివద్దే వైద్యం అందిస్తున్నాం



పీహెచ్‌సీలో అన్ని సదుపాయలు ఉన్నాయి. ఏ సమయంలోనైనా అత్యవసర సేవలు అందించేందుకు సిబ్బంది ఉన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రతి రోజు గ్రామాలకు వెళ్లి ఇంటి వద్దనే వైద్యం చేస్తున్నాం. బీపీ, షుగర్ ఉన్నవారికి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ శ్యామల, వైద్యాధికారి, అచ్చంపేట

విద్యార్థులకు జగనన్న కిట్ల పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

అమరావతి(పెదకూరపాడు): చదువుకు పేదరికం అడ్డు కాకూడదని , విద్యవ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. 75 త్యాళ్లురు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లి శ్రీనివాసరెడ్డి, గ్రామ కన్వీనర్ వజ్రాల శ్రీనివాసరెడ్డి, పాఠశాల పీసీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అల్లం భవానీ, బాజి సలాం పాల్గొన్నారు.

88 త్యాళ్లూరు..

88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88 త్యాళ్లూరు ఎంపీయూపీ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు గురువారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గాదె నరసింహారావు పాల్గొని విద్యార్థులకు యూనిఫాం, షూస్, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలోవైఎస్సార్‌సీపీ నాయకులు అత్తోట అప్పారావు, వేజండ్లరవి, నన్నూ బాషా, వల్లంసెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలల రక్షణ మనందరి బాధ్యత

క్రోసూరు: మండలంలోని పలు గ్రామాల్లో విలేజి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం గుడ్‌షెపర్డ్ సంస్థ అమరావతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మండలంలోని పీసపాడు, అందుకూరు,దొడ్లేరు గ్రామాల్లో నిర్వహించిన సమావేశాలకు చిల్కా బాబూరావు అధ్యక్షత వహించారు. తహసీల్దార్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలలు మన దేశ సంపద అని, బాలలను రక్షించటం మన బాధ్యత అని అన్నారు. ప్రతి బాలబాలికలను బడిలో చేర్పించాలని సూచించారు. బాల్య వివాహాలను నివారించేందుకు మనందరం కృషి చేయాలని చెప్పారు. బాల్యవివాహాల వలన విద్యను కోల్పోతారని, అభివృద్ధిని, ఆరోగ్యాన్ని కోల్పోతారన్నారు. విలేజి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులందరూ బాధ్యతగా బాల కార్మిక వ్యవస్థను, బాల్యవివాహాలను, నిర్మూలించాలని కోరారు.



చైల్డ్‌ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ డి.శ్రీనివాసరావు

సంక్షేమ పథకాలతో ఆర్థిక స్థిరత్వం

డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ కోటిరత్నం

నకరికల్లు: బడుగు, బలహీనవర్గాల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ జి.కోటిరత్నం అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ మహిళలకు స్థానిక ఎస్సీకాలనీలోని కమ్యూనిటీ హాలులో ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బడికి పిల్లలను పంపించిన తల్లిదండ్రుల కోసం ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా తల్లి ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. చేయూత, డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకాలు పేద మహిళలకు ఎంతగానో తోడ్పాటునిస్తున్నాయని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ.250 వేతనం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ రామకృష్ణ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ కోటిరత్నం

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సంస్థ చేయూత



బాధితులకు వంటిసామగ్రి, దుస్తులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ నిర్వాహకులు



దుస్తులు, వంటసామగ్రి పంపిణీ చేస్తున్న మాగులూరి ఫౌండేషన్ సభ్యులు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 14 పూరిపాకలు దగ్ధమైన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ సంస్థ, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చారు. రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి నరసరావుపేటకు చెందిన ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ జగన్‌మోహనరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబాలు టెంపరరీగా ఉండేందుకు టార్పాలిన్ పట్టాలు, వంట సామగ్రి, దుప్పట్లు, టవల్స్, పురుషలకు లుంగీలు, మహిళలకు చీరెలు, టాయిలెట్ సామగ్రి పంపిణీ చేశారు. వీటితో పాటు బియ్యం, కందిపప్పు, నూనె పాకెట్స్ తదితర వంట దినుసులు పంపిణీ చేశారు. వారి వెంట పెదపాలెం సర్పంచి నెల్లూరి హరిబాబు, మాజీ సర్పంచి నెల్లూరి చంద్రబాబు, తహసీల్దారు పద్మాదేవి, స్థానిక వైద్యులు డాక్టర్ యం.మధుసూదనరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రామిశెట్టి చిన్నయల్లమందయ్య పాల్గొన్నారు.

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో....

అగ్నిప్రమాద బాధతకుటుంబాలను గురువారం మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధి మాగులూరి భాను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి 25కిలోల బియ్యం టిక్కి, వంట సామగ్రి, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మాగులూరి హరిబాబు పాల్గొన్నారు....

వంట్టికుంట చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.....

అగ్నిప్రమాద బాదిత కుటుంబాలకు వట్టికుంట ఛారిటబుల్ ట్రస్ట్ ఆపన్నహస్తం అందించింది. ఇళ్లు కోల్పోయిన 14 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు, 25కిలోల బియ్యం పంపిణీ చేశారు. మంటల్లో చిక్కుకుని మృతిచెందిన పల్లవి కుటుంబానికి రూ.10వేలతో పాటు మెరుగైన వైద్య సేవలు మొత్తం తామే భరిస్తామని ట్రస్ట్ వ్యవసాపకులు వట్టికుంట శేషగిరిరావు తెలిపారు.

చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలి

సత్తెనపల్లి: చిన్నతనం నుంచే విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత కోరారు. పట్టణంలోని 22వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జనాభాగీధారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన ప్రీస్కూల్ కిట్ మెటీరియల్ ప్రదర్శింపజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ టి.సంతోషకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.జయలక్ష్మి, పి.ప్రమీల, అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సేక్ మెహబూబ్ అలీ,డాక్టర్ జి.ధర్మసింగ్ శాస్త్రీ, ఎం.తిరుమల లక్ష్మి, భాగ్యరేఖ పాల్గొన్నారు.



పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సీడీపీఓ శ్రీలత

సర్కారు ఆణిముత్యాలను ప్రోత్సహిద్దాం

- విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రెంటపాళ్లలో నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన చర్యల్లో భాగంగానే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, కార్పొరేట్ పాఠశాలల కంటే అధికంగా ఉత్తీర్ణత సాధించారని, వారిని ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యా శాఖాధికారి ఏ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇది పేదల పక్షపాత ప్రభుత్వమని ఏ విద్యార్థి పేదరికంతో చదువుకు దూరం కాకుండా ఉండేందుకే మీ మేనమామ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేసి మీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. నాడు– నేడు కార్య క్రమంతో పాఠశాలలకు మౌలిక వసతులు, వనరులు కల్పించి మెరుగులు దిద్దినట్లు వివరించారు. అమ్మఒడి పథకంతో ప్రభుత్వ పాఠశాలలో హాజరు పెంచామని, జగనన్న గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన లాంటి కార్యక్రమాలు ప్రభుత్వ విద్యారంగానికి పరిపుష్టిని కలిగించాయని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన లక్కరాజుగార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తికొండ శివమాధవరెడ్డి(ప్రథమ), కుంకలగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నందిగామ జెస్సికా(ద్వితీయ), మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీడిమల్ల వీరేంద్రకుమార్(తృతీయ) స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే ఇంటర్మీడియెట్ ద్వితీయ ఏడాదిలో రాయపాటి సురేష్(హెచ్‌ఈసీ, సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల), రావులపల్లి పావని(ఎంపీసీ, నకరికల్లు కేజీబీవీ), షేక్ చాందిని(సీఈసీ, నకరికల్లు ఏపీఎమ్ఎస్), షేక్ సల్మా (బైపీసీ, రామకృష్ణాపురం గురుకులం) ప్రతిభ చూపిన నాలుగు గ్రూపుల్లో నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున నగదు పురస్కారాలను అందజేసి, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటో దగ్ధం



అచ్చంపేట: విద్యుత్ స్తంభం వైర్ల నుంచి నిప్పురవ్వలు రావడంతో కిందనే ఉన్న ఆటో పాక్షికంగా కాలిపోయిన ఘటన స్థానిక పంచాయతీ కార్యాలయానికి సమీపంలో గురువారం వారం చోటుచేసుకుంది. గుంటూరుకు చెందిన తుళ్లూరు గోవర్ధన్ తన సొంత ఆటోలో అచ్చంపేటగు బాడుగకు వచ్చి విద్యుత్ స్తంభం కింద ఆటో ఆపుకుని భోజనానికి వెళ్లాడు. అసలే ఎండాకాలం, వేడిగాలు వీచడంతో వైర్లు రాసుకుని నిప్పు రవ్వలు ఆటోపై పడటంతో ఆటో వెనుక భాగం మొత్తం కాలిపోయింది. గమనించిన స్థానికులు వచ్చి మంటలపై నీళ్లజల్లి ఆర్పివేశారు. ఆటోపై పట్టాలు, లోపల సీట్లు పూర్తిగా కాలిపోగా, క్యాబిన్ పాక్షికంగా కాలిపోయింది.

అచ్చంపేట ఎస్ఐగా మణికృష్ణ



అచ్చంపేట: పల్నాడు జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు అచ్చంపేట స్టేషన్ ఆఫీసర్‌గా సీహెచ్ మణికృష్ణ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కె.పాల్ రవీంద్ర బదిలీపై వెళ్లారు. మణికృష్ణ గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీ కవిత

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.శ్రీలక్ష్మీ కవిత గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 149 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో జనరల్ ఓపీ 51 మంది, హైపర్ టెన్షన్ 34 మంది, డయాబెటిస్ 48 మంది, హైపర్‌టెన్షన్ అండ్ డయాబేటీస్ 50 మంది, గర్భిణులు 8 మంది, బాలింతలు ఆరుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించి గర్భిణికి సంపూర్ణ పోషణ్ అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సంపూర్ణదేవి, ఎంఎల్‌హెచ్‌పీ ఆరుద్ర గణేష్, ఏఎన్‌ఎం డి.జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ షేక్ సుభానీ, డీఈఓ డి. సుధాకర్, ఆశ కార్యకర్తలు టీ కమల కుమారి, డి.శ్రీదేవి పాల్గొన్నారు. అలాగే రెంటపాళ్ల గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్యాధికారి డాక్టర్ సాయి తేజారెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 303 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో జనరల్ ఓపి 18 మంది, హైపర్ టెన్షన్ 93 మంది, డయాబెటిస్ 51 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 107 మంది, గర్భిణులు 20 మంది, బాలింతలు నలుగురు, జ్వరం కేసులు ముగ్గురు, బెడ్‌రైడెన్ ముగ్గురు, చిన్నారులు ఆరుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులతో మాట్లాడి ఆరోగ్య బోధనపై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పల్లె శారిక, హెల్త్ సూపర్ వైజర్ పీఎం మార్గరేట్, ఎం.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం జి.కోటేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ జె.బాబు, డీఈఓ జి.ఇజ్రాయిల్, ఆశ కార్యకర్తలు పీ రాధాకుమారి, పీ పద్మ, జి.సీతమ్మ, షేక్ ఖాశింబి ఉన్నారు.

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు జయకృష్ణ 75 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో డీఈఓ రవితేజ, సీహెచ్‌ఓ శిరీష, ఎంపీహెచ్‌ఎస్ కరిముల్లా పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు గురువారం అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవి తేజనాయక్ 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. 12 మందికి బీపీ బిళ్లలు, 22 మందికి షుగర్ బిళ్లలను 15 రోజులకు సరిపడ పంపిణీ చేశారు. ఆరుగురు గర్భిణులు, ఇద్దరు బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలవ్యాధుల గల వారి ఇంటికి వెళ్లి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.శిరీష, ఏఎస్ఎం నాగ్రేంద్రం భాయి, రాజు, డీఈఓ చెవుల పూర్ణచంద్రరావు, ఆశ కార్యకర్తలు అంజలీ, కోటమ్మ పాల్గొన్నారు.

చిన్న పిల్లల గుండెజబ్బులపై అధ్యయనం చేస్తా



నీట్‌లో ర్యాంకర్ పోరెడ్డి మాధురి

అమరావతి: ప్రస్తుతం చిన్న పిల్లలకు కూడా గుండె జబ్బులు వస్తున్నాయని వీటిపై అధ్యయనం చేయాలనే పట్టుదలతో నీట్‌లో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించినట్లు మునగోడుకు చెందిన పోరెడ్డి మాధురి తెలిపారు. ఇటీవల విడుదల చేసిన నీట్ ఫలితాలలో పోరెడ్డి మాధురి 700 మార్కులకుగానూ 638మార్కులు సాధించి జాతీయ స్థాయి జనరల్ కేటగిరిలో 4,988ర్యాంకు సాధించింది. రాష్ట్ర స్థాయిలో 500లోపు ర్యాంకు తనకు వస్తుందని చెప్పారు. దేశానికి ఘనత వహించిన వైద్యనిపుణులను అందించిన గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీ బీఎస్ చదవాలన్నదే తన లక్ష్యమని మాధురి తెలిపారు. మునగోడులో వ్యవసాయం చేసుకునే తమబిడ్డకు మంచి ర్యాంకు రావటంపై మాధురి తల్లిదండ్రులు శివారెడ్డి, అన్నపూర్ణ ఆనందం వ్యక్తం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com